# వచ్చే నెలాఖరుకు తాగునీటిని అందిస్తాం

● చివరిదశలో తాగునీటి రిజర్వాయర్ల పనులు: జలమండలి జీఎం రవీందర్‌రెడ్డి వెల్లడి


వెంకటేశ్వరకాలనీలో కార్పొరేటర్ చంద్రశేఖర్‌తో కలిసి పర్యటిస్తున్న జలమండలి జీఎం రవీందర్‌రెడ్డి, సిబ్బంది

బండ్లగూడ, డిసెంబర్ 16: అన్ని కాలనీలకు త్వరలో తాగునీటిని అందించి ప్రజల దాహార్తిని తీరుస్తామని జలమండలి జనరల్ మేనేజర్ రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వినాయకనగర్, విద్యానగర్‌లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు విజ్ఞప్తి చేసిన విషయం విదితమే. ఈ మేరకు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ జలమండలి అధికారులను తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేయడంతో శనివారం జలమండలి జనరల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి స్థానికులతో కలిసి వెంకటేశ్వర కాలనీ, విద్యానగర్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. బైరాగిగూడ, గంధంగూడలో తాగునీటి రిజర్వాయర్లను నిర్మించడం జరిగిందన్నారు. పనులు చివరిదశలో ఉండటంతో తాగునీటి సమస్యలు వస్తున్నాయని, జనవరిలో పూర్తి దశలో పనులు అవుతాయని వెల్లడించారు. వచ్చే నెలాఖరుకు స్థానికంగా ఉన్న అన్ని కాలనీలకు తాగునీటి సరఫరాను మెరుగుపరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ తలారి చంద్రశేఖర్, జలమండలి మేనేజర్ రాజరాజ నరేందర్, రాములు, ప్రేమ్‌కుమార్, నరేందర్, రాములు, సుదర్శన్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.


వైద్య శిబిరంలో పాల్గొన్న కార్పొరేటర్ జంగం శ్వేత

## వైద్య శిబిరాలతో ఆరోగ్య పరిరక్షణ

సైదాబాద్, డిసెంబర్16: 'జనహిత సేవా ట్రస్ట్ కోహెన్స్ లైఫ్ సైన్సెస్ లిమిటెడ్, మలక్‌పేట యశోద దవాఖాన' సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఐఎస్‌సదన్ డివిజన్ పరిధి సరస్వతీనగర్ కాలనీలోని సరస్వతి శిశుమందిరంలో ఉచిత వైద్య శిబిరాన్ని డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేత ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరాలు పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణకు దోహదపడుతాయని, అందుకోసం ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వెంకటరత్నమ్మ, జనహిత సేవా ట్రస్ట్ ప్రతినిధి మధుకర్, సురేశ్, కృష్ణమనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## శబరికి బయలుదేరిన అయ్యప్పలు

మణికొండ, డిసెంబర్ 16:నార్సింగి మున్సిపాలిటీ ఖానాపూర్ నుంచి 45 మంది అయ్యప్ప మాల ధరించిన స్వాములు శబరిమలైకు బయలుదేరారు. ఖానాపూర్‌లోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప స్వాములు ఇరుముడులను కట్టుకోని శబరిమలైకు బయలుదేరి పయనమైయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మల్లేశ్, సర్పంచ్ గంగయ్య, కౌన్సిలర్ అమరేందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## యువకుడి ఆత్మహత్య

బండ్లగూడ, డిసెంబర్ 16: స్నేహితుడి ఇంట్లో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు కథనం ప్రకారం.. ప్లంబర్ పని చేసుకుంటు జీవనం సాగించే ఎంఎం పహాడ్‌కు చెందిన మహ్మద్ అస్లాం (24)కు బుద్వేల్ గ్రామానికి చెందిన షరీఫ్‌తో స్నేహం ఏర్పాడింది. దీంతో అస్లాం తరుచూ షరీఫ్ ఇంటికి వస్తూ ఉండేవాడు. శుక్రవారం రాత్రి షరీఫ్ తన కుటుంబ సభ్యులతో కలిసి విందుకు వెళ్లారు. ఇంట్లో ఎవరు లేని సమయంలో ఇంటికి వచ్చి అస్లాం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. షరీఫ్ అర్ధరాత్రి ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళాలు పగల గొట్టి ఉన్నాయి. దీంతో మొదట దొంగలు పడ్డారని బావించిన షరీఫ్ ఇంట్లోకి వెళ్లి చూసే సరికి అస్లాం ఉరి వేసుకుని వెళాడుతూ కనిపించాడు. దీంతో అతను పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహన్ని పోస్ట్‌మార్టం కోసం ఉస్మానియా దవాఖానకు తరలించారు. అస్లాం తండ్రి జహంగీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న దర్యాప్తు చేపడుతున్నామని పోలీసులు వెల్లడించారు.

# దేశాభివృద్ధిలో ప్రజలు భాగస్వామ్యం కావాలి

● 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర' ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

శంషాబాద్ రూరల్/జూబ్లీహిల్స్, డిసెంబర్ 16: కేంద్ర ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, దేశాభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర' కార్యక్రమాన్ని రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలోని చిన్న గోల్కొండలో ప్రైమ్ మినిస్టర్ మెసేజ్‌లను ఆడియో, వీడియో రూపంలో పొందుపరిచిన వాహనాలను జిల్లా కలెక్టర్ భారతి హోళికేరి, అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. కేంద్రం అందించే 17 రకాల పథకాలతో అర్హులందరూ లబ్ధి పొందడమే సంకల్పంగా జనవరి 25 వరకు సంకల్ప యాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ప్రతి పంచాయతీకి ప్రత్యేక వాహనంతో కూడిన బృందాలు ఆయా పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తాయన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందిన లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్‌లు, భూసార పరీక్షా ఫలితాల నిర్ధారణ కార్డులను, పొదుపు సంఘాలకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఏఎస్ అధికారి, జిల్లా ఇన్‌చార్జ్ మాణిక్యరాజ్, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రత్నం, కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు రాజ్‌భూపాల్‌గౌడ్, నందకిషోర్, మాజీ ఎంపీటీసీ యాదగిరితో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజలు పాల్గొన్నారు.



'సంకల్ప యాత్ర'ను జెండా ఊపి ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

# దైవభక్తితోనే జీవితం సంతృప్తికరం

సైదాబాద్, డిసెంబర్ 16: డిఫెన్స్ ల్యాబ్ క్వార్టర్స్‌లో నివసించే ఉద్యోగులందరూ కలిసి మెలిసి క్రిస్మస్ వేడుకలను జరుపుకోవటం సంతోషకరంగా ఉందని డీఆర్డీవో ధ్వనీ అసోసియేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సీనియర్ శాస్త్రవేత్త జస్టినా గీతా అన్నారు. శనివారం కాంచన్‌బాగ్‌లోని డీఆర్డీవో ఓపెన్ ఎయిర్ థియేటర్ (డీఎల్ఓఎంఐ)లో జరిగిన సెమీ క్రిస్టమస్ వేడుకలు బ్రదర్ సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రారంభమై ఘనంగా జరిగాయి. ఆరంభ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరైన జస్టినా గీతా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దైవభక్తి, ప్రేమాభిమాలను పెంచుకోవటం ద్వారానే జీవితం సంతృప్తికంగా ఉంటుందన్నారు. అనంతరం 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ కాలేబు, బెరాకా మినిస్ట్రీస్ ప్రతినిధి సిస్టర్ షెకెనా గోర్లీ, ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ సుధాకర్ రావు, వైస్ చైర్మన్ బాబు రావు, సెక్రటరీ నరేశ్, కోశాధికారి పవన్‌కుమార్, సీనియర్ కమిటీ సభ్యులు కృపాచారి, కమిటీ సభ్యులు, డీఆర్డీవో ఉద్యోగులు, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.


నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జస్టినా గీతా

## కారు బీభత్సం.. ఒకరు మృతి.. ముగ్గురికి గాయాలు

మన్సూరాబాద్, డిసెంబర్ 16: ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కారు బీభత్సం సృష్టించింది. ఓ వ్యక్తి అతివేగంతో రోడ్డు పక్కన నిల్చున్న ఇద్దరు వ్యక్తులను, రెండు బైక్‌లను ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందగా.. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మరో వ్యక్తి స్వల్పంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. నల్గొండ జిల్లా మునుగోడు మండలం ఊకొండి గ్రామానికి చెందిన బొడ్డుపల్లి మల్లేశ్(50) ఎలక్ట్రీషియన్. ఎల్బీనగర్ సరస్వతినగర్ కాలనీలో నివాసం ఉండే కూతురు తేజ, కుమారుడు వినయ్‌లను చూసేందుకు కారులో వచ్చి చింతల్‌కుంట లోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్ద దిగాడు. ఇతనితో పాటు కంచర్ల జన్నారెడ్డి అనే వ్యక్తి కూడా అక్కడే నిల్చున్నాడు. అదే సమయంలో సాయంత్రం 7గంటలకు విజయవాడ నుంచి బీఎండబ్లూ కారులో దేవకినందన్ అనే వ్యక్తి అతి వేగంగా వచ్చి రోడ్డు పక్కన నిల్చున్న బొడ్డుపల్లి మల్లేశ్, జన్నారెడ్డితో పాటు ఆక్టివాపై ఉన్న శశిప్రీతంరెడ్డిని హీరోహోండాపై ఉన్న పవన్‌కుమార్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో బొడ్డుపల్లి మల్లేశ్ అక్కడికక్కడే మృతిచెందగా.. పవన్‌కుమార్, జన్నారెడ్డికి కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డారు. శశిప్రీతంరెడ్డికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను ఓ ప్రైవేట్ దవాఖానకు చికిత్స నిమిత్తం తరలించారు. ప్రమాదంలో మృతిచెందిన మల్లేశ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుడి కుమారుడు వినయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎల్బీనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ దేవకినందన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కారుపై గతంలోనూ అతివేగంగా నడిపినట్లు నాలుగు చలాన్లు కూడా నమోదై ఉన్నాయి.




## ఘనంగా 'స్వచ్ఛతా పక్షోత్సవం'

స్వచ్ఛ భారత్ మిషన్ భాగంగా శనివారం ఐసీఏఆర్–సెంట్రల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఫర్ డ్రైలాండ్ అగ్రికల్చర్ లో 'స్వచ్ఛతా పఖ్వాడా' నిర్వహించారు. డిసెంబర్ 31 వరకు 'స్వచ్ఛతా పక్షోత్సవం' కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు అధికారులు తెలిపారు. ఈమేరకు సంస్థ ఉద్యోగులతో డైరెక్టర్ వికే సింగ్ ప్రతిజ్ఞ చేయించారు. – మాదన్నపేట, డిసెంబర్ 16



## ఓపెన్ కిక్ బాక్సింగ్‌లో సత్తాచాటిన తరుణ్

'ఖేలో ఇండియా తెలంగాణ స్టేట్ ఓపెన్ కిక్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్–2023' పోటీల్లో మైలార్‌దేవ్‌పల్లికి చెందిన తరుణ్ సంక్ల రెండు బంగారు పతకాలను సాధించారు. శనివారం తరుణ్ సంక్లతో పాటు కోచ్ నిఖిలేశ్‌రెడ్డిని డివిజన్ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి అభినందించి సర్టిఫికెట్లును అందించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బుచ్చిరెడ్డి, తలారి చిన్న, చందునాయక్, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.
– మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 16


ఆలయ వార్షికోత్సవానికి హాజరైన మూసారాంబాగ్ కార్పొరేటర్ దంపతులను సత్కరిస్తున్న ఆలయకమిటీ సభ్యులు

## ఘనంగా ఆలయ వార్షికోత్సవం

మలక్‌పేట, డిసెంబర్ 16: మూసారాంబాగ్ డివిజన్‌లోని ఈస్ట్ ప్రశాంత్‌నగర్ అభయాంజనేయస్వామి ఆలయ 17వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజలకు డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి, మధుసూదన్‌రెడ్డి దంపతులు, భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీ కంచి కామకోటి పీఠం ఆలయ పునర్నిర్మాణ పనుల శిలాఫలకాన్ని కార్పొరేటర్ ఆవిష్కరించారు. కార్పొరేటర్ భాగ్యలక్ష్మిని సత్కరించి, తీర్థ, ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆల య ధర్మాధికారి బాలగోపాల్, ఆలయకమిటీ అధ్యక్షుడు అంజయ్య, ఉపాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి విజయ్‌శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్

మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 16: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి వారిని విజ్ఞానవంతులుగా ఎదిగేలా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందని రామకృష్ణ సేవా సమితి సభ్యులు వెల్లడించారు. స్వామి వివేకానంద రామకృష్ణ మఠాన్ని స్థాపించి 125 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా ఆయన స్ఫూర్తిని విద్యార్థులకు పరిచయం చేసేందుకు టాలెంట్ టెస్ట్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ మేరకు శనివారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. రాజేంద్రనగర్ మండల పరిధిలోని మొత్తం 25 పాఠశాలల్లో 2000 మంది విద్యార్థులకు ఈ టెస్ట్‌ను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు నగదు పురస్కారాలు, స్వామి వివేకానంద సాహిత్యాన్ని బహూకరిస్తామన్నారు. 6వ నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ టాలెంట్ టెస్ట్‌లో పాల్గొన్నారన్నారు. జనవరి 12వ తేదీన వివేకానంద జయంతి సందర్భంగా బహుమతులను ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. టాలెంట్ టెస్ట్ నిర్వహించడానికి సహకరించిన రాజేంద్రనగర్ ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్, ఎంఈవోకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరామకృష్ణ సేవా సమితి సభ్యులు శ్రీనివాస్, సీహెచ్ శ్రీనివాస్, శశి, సతీశ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.